నమస్తే తెలంగాణ
రాజన్న సిరిసిల్ల
5 కరీంనగర్, బుధవారం 7 ఫిబ్రవరి 2024 RAJANNA SIRCILLA

## రేవంత్ వ్యాఖ్యలపై ఆగ్రహజ్వాల



రేవంత్ దిష్టిబొమ్మతో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు చోట్ల ముఖ్యమంత్రి దిష్టిబొమ్మలను దహనం చేశారు. వేములవాడ పట్టణంలోని తెలంగాణచౌక్‌లో బీఆర్ఎస్ యువజన నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు.

- వేములవాడ, ఫిబ్రవరి 6

## ఇసుక ధరలకు రెక్కలు

- క్వారీల మూతతో అమాంతం పెరిగిన రేట్లు
- స్టాక్ యార్డుల్లో నిల్వల తరలింపునకే అనుమతులు
- మరో మూడు నెలల్లో అవి కూడా ఖాళీ అయ్యే అవకాశాలు
- వందలాదిగా లారీల క్యూ..
- అదనపు చార్జీల మోతతో సామాన్యులపై భారం



ఓదెల మండలం గుండ్లపల్లి వద్ద లారీల్లో చేస్తున్న ఇసుక లోడింగ్

**ఇసుక ధరలకు ఒక్కసారిగా రెక్కలు వచ్చాయి. క్వారీల మూతతో ఆకాశాన్నంటుతున్నాయి. అమాంతం పెరిగిన ధరలను చూసి సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. బుకింగ్ నుంచి ట్రాన్స్‌పోర్టు దాకా అదనంగా చెల్లించాల్సి వస్తున్నదని వాపోతున్నారు. పెద్దపల్లి జిల్లా నుంచి హైదరాబాద్ తరలించేందుకు లారీ ఒక్కో ట్రిప్పునకు అదనంగా ₹10వేలకు పైనే అవుతున్నాయని చెబుతున్నారు. ప్రజలకు మేలు చేయాల్సిన ప్రభుత్వం ఇలా క్వారీలు మూసివేసి ఇలా ఆర్థికంగా ఇబ్బంది పెట్టడం సరికాదని సూచిస్తున్నారు.**

పెద్దపల్లి, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ) : గత కేసీఆర్ సర్కారు రెండేళ్ల క్రితం (2022) పెద్దపల్లి జిల్లాలోని మానేరు, హుస్సేన్‌మియా వాగులపై టీఎస్ఎండీసీ ఆధ్వర్యంలో 23 ఇసుక క్వారీలకు టెండర్లు పిలిచింది. అందులో ఒక్కటి మినహా మిగతా 22 క్వారీలకు టెండర్లు పూర్తయ్యాయి. మానేరు నదిపై 18, హుస్సేన్‌మియావాగుపై 4 క్వారీలు నడువగా, వీటి గడువు గత డిసెంబర్ 31తో ముగిసింది. అయితే, ఇసుక తవ్వకాలపై మధ్యలో పలువురు గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించడంతో దాదాపు ఐదారు నెలల పాటు నిలిచిపోయాయి. తాజాగా గడువు ముగియడంతో కాంట్రాక్టు గడువును పొడిగించాల్సి ఉన్నా.. పొడిగించలేదు. ఇసుక తవ్వకాలకు పర్మిషన్ ఇవ్వలేదు. దీంతో ఆ 22 క్వారీలు బంద్ అయ్యాయి. అయితే చిన్నఓదాల, అడవిశ్రీరాంపూర్, ముత్తారం, ఓడేడ్, గోపాల్‌పూర్, అడవిసోమన్‌పల్లి స్టాక్ యార్డుల్లో భారీగా ఇసుక నిల్వలు ఉండడంతో తరలించేందుకు మాత్రం అనుమతులున్నాయి. దీంతో ఆ ఆరు చోట్ల నుంచి తరలింపు సాగుతుండగా, మరో మూడు నెలల్లో ఖాళీ కానున్నాయి.

### నెల క్రితం వరకు ఇలా..

పెద్దపల్లి జిల్లాలోని ఇసుక క్వారీల్లో గృహ, ఇతర నిర్మాణాలకు సంబంధించి మూడు రకాల ఇసుక లభ్యమవుతున్నది. ఇండ్ల నిర్మాణాల మొదటి దశలో వాడే గల్ల ఇసుక (కోర్ సాండ్), నిర్మాణాల మధ్యలో వాడే కట్టుబడి ఇసుక, చివరి సమయంలో వాడే ఫైన్ సాండ్ దొరుకుతున్నది. కోర్ సాండ్ టన్నుకు ₹411, కట్టుబడి ఇసుకకు ₹1300, ఫైన్ సాండ్‌కు ₹1500 చొప్పున చెల్లించి బుక్ చేసుకునేది. అదనంగా ట్రాన్స్‌పోర్టు చార్జీలు భరించి ఈ ఇసుకను క్వారీల నుంచి 14 టైర్ల టిప్పర్లలో 32 టన్నులు, 16 టైర్ల టిప్పర్లలో 35 టన్నులను రవాణా చేసుకునేది. హైదరాబాద్‌తోపాటు 13 జిల్లాలకు ఇక్కడి నుంచి తీసుకెళ్లేది. నెల క్రితం వరకు పరిస్థితి బానే ఉన్నా.. ప్రస్తుతం అంతా మారిపోయింది.

### అడ్డగోలు ధరలు

గతంలో 22 క్వారీలు నడిచినప్పుడు ఒక్కో క్వారీకి రోజుకు 40 లారీల వరకు వచ్చేవి. అయితే అవి మూతపడగా, ఆరు స్టాక్ యార్డులకు డిమాండ్ పెరిగింది. దీంతో ఒక్కో చోటనే వందకుపైగా లారీలు క్యూ కడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఇసుక ధరలు అమాంతం పెరిగాయి. నెల క్రితం వరకు 14 టైర్ల టిప్పర్‌లో 32 టన్నుల కోర్ సాండ్ కోసం ₹13,152 చెల్లించి బుక్ చేసుకునేది. హైదరాబాద్ తరలించేందుకు ఒక్కో ట్రిప్పునకు ₹40 వేలకుపైగా వినియోగదారుడికి ఖర్చయ్యేది. కానీ, ప్రస్తుతం ₹50 వేల నుంచి ₹60 వేల వరకు ఖర్చవుతున్నది. ప్రభుత్వానికి చెల్లించే మొత్తం మారకున్నా.. రవాణా, ఇతరత్రా ధరలు రెట్టింపయ్యాయి. ఇంతకుముందు ఇసుక బుక్ చేసేందుకు ₹200 నుంచి ₹300 వరకు తీసుకున్నా.. ప్రస్తుతం ₹1500 నుంచి ₹3వేల వరకు వసూలు చేస్తున్నారు. అలాగే, స్టాక్ యార్డు వద్ద రోజుకు 40 లోపు లారీల్లో లోడింగ్ చేస్తుండగా.. వందలాదిగా వస్తున్న లారీలు ఒకటి రెండు రోజుల పాటు వేచి చూడాల్సి వస్తున్నది. దీంతో వెయిటింగ్ చార్జీలంటూ అదనంగా ₹7 వేల నుంచి ₹8 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇలా ధరల పెంపుతో సామాన్యులు లబోదిబోమంటున్నారు. తిరిగి ప్రభుత్వం ఇసుక క్వారీలను కొనసాగిస్తేనే తప్ప ధరలు దిగిరావని చెబుతున్నారు. దీనిపై స్థానిక నేతలు పట్టించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# పూలే విగ్రహ ఏర్పాటే లక్ష్యం



రౌండ్‌టేబుల్ సమావేశానికి హాజరైన బీసీ కుల సంఘాల ప్రతినిధులు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

- అదే మన మొదటి అడుగు
- ఏప్రిల్ 11లోగా సానుకూల ప్రకటన చేయాలి
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి
- కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి
- భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- కరీంనగర్ రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరు

కమాన్ చౌరస్తా, ఫిబ్రవరి 6 : 'బీసీల అభివృద్ధి కోసం మూడు ప్రధాన డిమాండ్లతో ముందుకు సాగుతున్నాం. అందులో మొదటిదైన అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహ ఏర్పాటే లక్ష్యంగా ముందడుగు వేద్దాం' అని భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కులగణన చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీసీ హక్కుల సాధన కోసం భారత జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ సంయుక్తంగా మంగళవారం కరీంనగర్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల సమయంలో బీసీ డిక్లరేషన్ ఇచ్చిన మేరకు కాంగ్రెస్ ఆరు నెలల్లో కులగణన చేపట్టాలని, ఆ ప్రక్రియ తక్షణమే ప్రారంభించాన్నారు. ఈ 2024-25 బడ్జెట్‌లో బీసీ సంక్షేమం కోసం ₹20 వేల కోట్లు కేటాయించాలని, అసెంబ్లీలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహ ఏర్పాటుపై ఏప్రిల్ 11లోగా ప్రభుత్వం సానుకూల ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఏప్రిల్ 12న వివిధ రాష్ట్రాల ప్రతినిధులతో కలుపుకుని ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. 1931లో కులగణన జరిగిందని, తర్వాత యూపీఏ ప్రభుత్వం ₹4500 కోట్లు ఖర్చు చేసి కులగణన చేపట్టినా ఆ వివరాలను ప్రజల ముందు పెట్టలేదని గుర్తు చేశారు. కర్నాటకలో కులగణన చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, కానీ, బిహార్‌లో కులగణనకు సంబంధించి కోర్టుల్లో ఇబ్బందులు ఎదురయ్యాయన్న సాకుతో చేతులెత్తేసిందని విమర్శించారు. తెలంగాణలో అలా జరగకుండా ఉండాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై స్పష్టమైన కార్యాచరణను ప్రకటించాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే కొత్తగా దాదాపు 24 వేల మంది బీసీలు ఎంపీటీసీలు, సర్పంచులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, జడ్పీటీసీలు అవుతారని ఆ పార్టీ చెప్పిందని గుర్తు చేశారు. కానీ, అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడిచినా అందుకు సంబంధించి ముందడుగు వేయలేదని విమర్శించారు. పరిపాలనలో బీసీల భాగస్వామ్యం ఉండాలంటే తక్షణమే జనగణన ప్రక్రియ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అలాగే, ఇచ్చిన హామీ మేరకు బీసీల సంక్షేమానికి బడ్జెట్‌లో ఏటా ₹20 వేల కోట్లు కేటాయించాలన్నారు. ఏ రాష్ట్రంలో ఆ రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ఇచ్చుకునే సౌలభ్యం కల్పించాలని, తద్వారా జనాభా ఆధారంగా రాష్ట్రాల్లో రిజర్వేషన్లు చేసుకోవచ్చని తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ప్రతిపాదించారని గుర్తు చేశారు. కానీ, కేంద్ర ప్రభుత్వం మాత్రం ఆ అవకాశాన్ని ఇవ్వడం లేదని మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు కోటా కల్పించాలని డిమాండ్ చేశారు. 2018 నుంచి ఇప్పటి వరకు 4,365 మంది సివిల్స్‌కు ఎంపికైతే.. అందులో 1195 మంది మాత్రమే బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఉన్నారని, ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు ఉన్నా కేవలం 15.5 శాతం మందిని మాత్రమే ఎంపిక చేశారని చెప్పారు. కోల్పోతున్న రిజర్వేషన్లపై బీసీ మేధావులు గళమెత్తాలని పిలుపునిచ్చారు. కేంద్రం ఇటీవల ప్రవేశపెట్టిన ₹26 లక్షల కోట్ల బడ్జెట్‌లో బీసీలకు కేవలం ₹5 వేల కోట్లే కేటాయించిందని విమర్శించారు. హక్కుల కోసం తెలంగాణ ఉద్యమం తరహాలో పోరాడాల్సిన అవసరమున్నదని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో కరీంనగర్ ముందువరసలో ఉందని, భారత జాగృతిగా రూపాంతరం చెందిన తెలంగాణ జాగృతి అనేక సామాజిక అంశాలపై పోరాటాలు చేసిందని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంతో కొట్లాడి బతుకమ్మకు రాష్ట్ర హోదా, నిరాహార దీక్ష చేసి అసెంబ్లీ ఆవరణలో అంబేద్కర్ విగ్రహం సాధించామన్నారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసి దాదాపు 20 వేల మంది యువతకు ఉద్యోగ కల్పనకు దారిచూపామని, దేశవ్యాప్తంగా మహిళా బిల్లుపై చర్చకు ప్రేరేపించామని వివరించారు.ఈ సమావేశానికి నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ అధ్యక్షత వహించగా, మాజీ మంత్రి రాజేశంగౌడ్, నాయకులు బొల్లం శివశంకర్, రాజారాంయాదవ్, కేవీ మహేందర్, వరాల శ్రీనివాస్, మేయర్ వై సునీల్‌రావు, భారత జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగు నవీన్‌ఆచారి, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పసుల చరణ్, జిల్లా అధ్యక్షుడు జాడి శ్రీనివాస్, గందె కల్పన, బాలసంకుల అనంతరావు, శివరాణి, విష్ణువర్ధన్, సంతోష్, గట్టెపల్లి దీపక్ పాల్గొన్నారు.

### పూలేకు భారత రత్న ఇవ్వాలని కోరాం

జ్యోతిబాపూలేకు భారత రత్న ఇవ్వాలని అప్పటి కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్‌తో కలిసి మోదీ ప్రభుత్వాన్ని కోరాం. జీరో అవర్‌లోనూ ఈ విషయంపై చర్చించాం. ఈ విషయంపై బీజేపీ ప్రభుత్వం నోరు మెదపలేదు.

### సమాజానికి వెన్నెముక బీసీలు



సమాజంలో బీసీలు అంటే వెనుబడ్డవారు కాదు. సమాజానికి వెన్నెముకలాంటి వారు. ఎమ్మెల్సీ కవిత ఆ రోజు అంబేద్కర్ విగ్రహం కోసం పోరాడి, విగ్రహ ఏర్పాటులో తనదైన ముద్ర వేసుకున్నారు. ఇదే క్రమంలో పూలే విగ్రహ ఏర్పాటుకు పూనుకున్నారు. ఆమెకు తెలంగాణ బీసీలంతా అండగా ఉందాం.

**- గట్టు రామచందర్, యునైటెడ్ పూలే ఫ్రంట్ కన్వీనర్**

# కాంగ్రెస్‌ది రాక్షస పాలన



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, వేదికపై జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్

- '420' హామీలతో గద్దెనెక్కారు
- ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చింది
- కాళేశ్వరంపై ఇన్ని అబద్ధాలా..?
- బీఆర్ఎస్ శ్రేణులందరూ కలిసికట్టుగా పనిచేయాలి
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
- ఎన్టీపీసీలో రామగుండం నియోజకవర్గ కార్యకర్తల మీటింగ్
- కేసీఆర్‌కు రేవంత్ క్షమాపణ చెప్పాలని సమావేశంలో తీర్మానం

జ్యోతినగర్, ఫిబ్రవరి 6: 'కాంగ్రెస్ అన్నీ అబద్ధాలే చెప్పింది. బీఆర్ఎస్‌పై దుష్ప్రచారం చేసింది. సామాజిక మాధ్యమాల్లో ఫేక్ పోస్టులు పెట్టింది. ఆచరణ సాధ్యం కాని '420' హామీలిచ్చి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చింది. ఈ ప్రభుత్వ పాలన రాక్షస పాలనను తలపిస్తుది. 50 రోజుల్లోనే ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడిందని' మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఘాటుగా విమర్శించారు. మంగళవారం ఎన్టీపీసీలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో రామగుండం నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్యఅతిథిగా వచ్చి, మాట్లాడారు. అందరూ కలిసి కట్టుగా పనిచేసి వచ్చే ఎంపీ ఎన్నికల్లో పెద్దపల్లి సెగ్మెంట్‌లో బీఆర్ఎస్ జెండా ఎగరేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకువచ్చిన కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. పదేండ్ల పాలనలోనే తెలంగాణను దేశంలోనే ఆదర్శంగా నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. మంత్రులు బీఆర్ఎస్ పాలనను బద్నాం చేసేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అసత్య ప్రచారం చేస్తున్నారని, ప్రాజెక్టు మొత్తానికే మొత్తం కూలిపోయిందని ప్రజలను నమ్మించేందుకు తీవ్రంగా కృషిచేస్తున్నారని ధ్వజమెత్తారు. పార్టీ అధినేత కేసీఆర్‌పై సీఎం రేవంత్ ఇష్టారాజ్యంగా మాట్లాడితే తప్పుకాదు కానీ, మాటకు మాట సమాధానం చెప్పిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై కేసులు పెట్టడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమ టైంలో చంద్రబాబు చంకలో ఉండి రైఫిల్‌తో తిరిగిన చరిత్ర రేవంత్‌రెడ్డిది అని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో రేవంత్ కొత్త మెలిక పెడుతున్నారని, రాష్ట్రంలో 17 ఎంపీ సీట్లు గెలిపిస్తేనే గ్యారంటీలు అమలవుతాయని, కేంద్రంలో ఇందిరమ్మ రాజ్యం రావాలని మాట్లాడడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ తల్లి విగ్రహంపై రేవంత్‌రెడ్డి రాజకీయం చేస్తే తెలంగాణ ఉద్యమాన్ని, ప్రజలను కించపరిచినట్లేనన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో మళ్లీ కరెంటు కోతలు మొదలయ్యాయని, ప్రజలకు కనీస మౌలిక వసతులు అందడం లేదన్నారు. పింఛన్లు, రైతుబంధు, సాగునీరు ఇవ్వడం లేదని, ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్రంగా వ్యతిరేకత ఏర్పడుతున్నదని చెప్పారు. పార్టీ శ్రేణులంతా ప్రజల పక్షాన నిలబడి చైతన్యవంతం చేయాలని, ఎంపీ ఎన్నికల్లో సత్తాచాటాలని సూచించారు. ఇక్కడ రామగుండం మేయర్ డాక్టర్ అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు, జడ్పీటీసీ ఆముల నారాయణ, కార్పొరేటర్లు కృష్ణవేణి, రమణారెడ్డి, కుమ్మరి శ్రీనివాస్, నాయకులు మూల విజయారెడ్డి, పీటీ స్వామి, జేవీ రాజు, తోడేటి శంకర్‌గౌడ్, అచ్చవేణు, గోపు ఐలయ్య యాదవ్, తిరుపతి నాయక్, మెట్టుపల్లి అనిల్‌రావు, వీరాలాల్, ఈదునూరి పర్వతాలు, తోకల రమేశ్ ఉన్నారు. కాగా, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చందర్ సమక్షంలో సమావేశం ఖండించింది. కేసీఆర్‌కు రేవంత్ వెంటనే క్షమాపణలు చెప్పాలని తీర్మానించింది.

### గులాబీ జెండాను ఎగురవేయాలి

కాంగ్రెస్ 420 హామీలతో గద్దెనెక్కింది. ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చడంలో ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోయింది. ఆ పార్టీని నమ్మే పరిస్థితిలో లేరు. మన తెలంగాణ ప్రజల కోసం వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ జెండాను ఎగురవేద్దాం. ఆనాడు తెలంగాణ కోసం ఎలాగైతే కొట్లాడామో.. ఈ రోజు ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీ నెరవేరేదాకా పోరాడుదాం. మన సత్తా ఏంటో చూపిద్దాం.

**- పుట్ట మధూకర్, జడ్పీ చైర్మన్**

### కేసీఆర్‌కు రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

కొట్లాడి సాధించిన రాష్ట్రాన్ని తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నిరంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దారు. రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపిన మహనీయుడిపై రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదు. వెంటనే తెలంగాణ సమాజానికి, కేసీఆర్‌కు రేవంత్ క్షమాపణ చెప్పాలి. లేకపోతే రేవంత్‌రెడ్డిని రాష్ట్రంలో ఏ ఊరిలోకి రాకుండా అడ్డుకుంటాం. క్షమాపణలు చెప్పేదాకా నిరసన చేపడుతాం.

**- కోరుకంటి చందర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే**



హాజరైన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు

